నేల కాలుష్యం

గ్రామ సమీపంలో ఏర్పాటైన ఎన్టీపీసీ చిమ్నీల నుంచి విడుదలవుతున్న బూడిద వల్ల వ్యవసాయ పంటలు నాశనమవుతున్నట్లు రైతులు వాపోతున్నారు. కూలింగ్ టవర్ల నుంచి వెలువడుతున్న ఉప్పు నీటి చెమ్మ వల్ల ఇళ్లకు నష్టం కలుగుతోందని, రెండేళ్ల కోసారి మరమ్మతులు చేసుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చిమ్నీల నుంచి వస్తున్న చెమ్మకు బీటలు వారుతున్న ఇల్లు

నీటి కాలుష్యం

పరిశ్రమ నుంచి వస్తున్న రసాయనిక, ఇతర వ్యర్థాలను గ్రామ సమీపంలోని కాలువ ద్వారా విడిచి పెడుతున్నారు. దీంతో గ్రామంలోని బోర్లు, బావులు ఉప్పునీటి మయంగా మారిపోయి, కనీసం పశువులు తాగేందుకు్కూడా వీల్లేకుండా పోయినట్లు స్థానికులు చెప్తున్నారు. తాగునీటికి పక్క గ్రామాలపై ఆధారపడాల్సి వస్తోందంటున్నారు.



గ్రామాన్ని ఆనుకుని ప్రవహిస్తున్న ఎన్టీపీసీ వ్యర్థాల ఉప్పునీటి కాలువ

వాయు కాలుష్యం

చిమ్నీ నుంచి ఎగసి పడుతున్న కాలుష్య కారకాలను పీల్చడం వల్ల అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. పశువులు చెట్లు చనిపోతున్నాయని, ప్రజలు ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, నేత్ర సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారని స్థానికులు చెప్తున్నారు. చాలా సార్లు ఆందోళన చేసినా ప్రయోజనం లేకపోయిందంటున్నారు.



కాలుష్యం కారణంగా ఎండిపోతున్న మామిడి చెట్టు కొమ్మలు

బతుకుల్లో 'బుగ్గి'

భగత్‌సింగ్, అల్లూరి, నేతాజీ మళ్లీ మళ్లీ పుట్టాలి.. కానీ మనింట్లో కాదు..! పక్కింట్లో పుట్టాలి.. ఎందుకో కారణం చెప్పాల్సిన పనిలేదు. పరిశ్రమల తీరు కూడా ఇంతే. వాటి ప్రయోజనాలు ఎక్కడెక్కడి వారో పొందుతారు. పరిణామాలు మాత్రం పరిశ్రమను ఆనుకుని ఉన్న గ్రామాలకే పరిమితం. సింహాద్రి ఎన్టీపీసీ ప్రభావిత సోమునాయుడుపాలెం దుస్థితి కూడా అంతే. నిర్వాసితులుగా శాశ్వత ఉపాధి ఆశించి భంగపడ్డారు. పరిశ్రమ కాలుష్యం నుంచి మాత్రం తప్పించుకోలేక గ్రామ ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు.

- ఎన్టీపీసీ కాలుష్యంతో సోమునాయుడుపాలెం విలవిల
- శాశ్వత ఉపాధి దక్కక నిర్వాసితుల ఆవేదన
- చుక్క తాగునీటికీ పక్క గ్రామాల్లోని వాటర్ ప్లాంట్లే ఆధారం
- సురక్షిత ప్రాంతానికి గ్రామం తరలింపు కోసం ఎదురుచూపులు



గ్రామానికి సమీపంలో ఉన్న సింహాద్రి ఎన్టీపీసీ పరిశ్రమ భారీ చిమ్నీలు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ పరిశ్రమ ఏర్పాటైతే తమ బతుకులు బాగుపడతాయని ఆశించిన మండలంలోని రావాడ శివారు సోమునాయుడుపాలెం ప్రజలకు తీవ్ర నిరాశే మిగిలింది. గ్రామంలో 60 కుటుంబాలకు చెందిన ప్రజలు స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుని ఉన్నారు. వీరికి ప్రధాన జీవనాధారం వ్యవసాయం. గ్రామానికి సమీపంలో 27 ఏళ్ల క్రితం సింహాద్రి పవర్ ప్లాంట్ ద్వారా బతుకుల్లో వెలుగులు నిండుతాయనుకున్నారు. తమ కుటుంబాల్లో చదువుకున్న వారికి స్థానికంగానే ఉపాధి దొరుకుతుందని ఆశపడ్డారు. తాత ముత్తాతల నుంచి వస్తున్న పంట పొలాలను సైతం పరిశ్రమ యాజమాన్యానికి ధారాదత్తం చేశారు. చివరికి ఫలితం మాత్రం శూన్యమేనని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాలుష్యం కోరల్లో.. పరిశ్రమ ద్వారా ఉపాధి అవకాశాల్లేకపోగా.. అది విడుదల చేస్తున్న బూడిద ఇతర కాలుష్యం కారకాలు గ్రామస్తుల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కాలుష్య కాసారంగా మారుతున్న తమ గ్రామాన్ని సురక్షిత ప్రదేశానికి తరలించాలని ఏళ్ల తరబడి కోరుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవట్లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పంటలు నాశనం



ఎన్టీపీసీ చిమ్నీ, కూలింగ్ టవర్ల నుంచి ఎగసిపడుతున్న ధూళి దుమ్ము కారణంగా వ్యవసాయ పంటలు మాడిమసైపోతున్నాయి. కూరగాయలు, చిరుధాన్యాలు తదితర ఆరుతడి పంటలకు కూడా భూములు అనుకూలం కాకుండా పోయాయి. ఆశ చావక పంటలు వేస్తుంటే.. పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదు. ఆర్థికంగా నష్టపోతున్నాం. దీర్ఘకాలిక పంటలైన సరుగుడు, యూకలిప్టస్ వేసుకుంటున్నాం. కనీసం ఆ పంటలైనా చేతికొస్తాయో.. లేదో..?

– కూండ్రపు నాయుడు, రైతు

తాగునీటి కష్టాలు



ఎన్టీపీసీ వ్యర్థాలు గ్రామం మీదుగా వెళ్తుండటంతో ఊర్లోని బోర్లు, బావులు దప్పిక తీర్చుకునేందుక్కూడా వీల్లేనంతగా కలుషితమయ్యాయి. బొబ్బిలి నుంచి ఏర్పాటు చేసిన పైప్‌లైన్ ద్వారా సరఫరా చేసే నీరు కూడా బాగోలేదు. వెన్నలపాలెంలోని వాటర్ ప్లాంట్‌పై ఆధారపడి దప్పిక తీర్చుకుంటున్నాం. పరిశ్రమ నుంచి ఎగసిపడుతున్న ఉప్పునీటి చెమ్మతో ఇళ్ల గుల్లబారిపోతున్నాయి. శ్లాబులు పెచ్చులూడి నేల రాలుతున్నాయి.

– కె.లక్ష్మి, గృహిణి

ఉపాధి కల్పించాలి



ఎన్టీపీసీ కాలుష్యం వల్ల వ్యవసాయ పంటలు నాశనమవుతున్నాయి. ఉపాధి కోల్పోయి దిక్కు తోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాం. ఎన్టీపీసీ స్థాపనకు భూములు ధారబోసిన నిర్వాసితులకు పరిశ్రమలో శాశ్వత ఉపాధి లభిస్తుందని ఆశించి భంగపడ్డాం. గ్రామంలో అనేక మంది యువకులు డిగ్రీ, డిప్లమో, ఐటీఐ చదివి నిరుద్యోగులుగా కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పటికైనా నిర్వాసిత కుటుంబాల యువతకు ఉపాధి కల్పించాలి.

– సిరిపరపు ప్రసాద్, సోమునాయుడుపాలెం

అనారోగ్యంతో అవస్థలు



పరిశ్రమ విడుదల చేస్తున్న కాలుష్యంతో సతమతమవుతున్నాం. స్త్రీలకు సంబంధించిన వ్యాధులతో పాటు చర్మ వ్యాధులు, శ్వాసకోశ వ్యాధులు, గుండె జబ్బులతో నానా అవస్థలు పడుతున్నాం. కాయకష్టం చేసి సంపాదించిన సొమ్మంతా జబ్బులు నయం చేసుకోవడానికి ఆస్పత్రులకే చెల్లించాల్సిన దుస్థితి. కాలుష్య కోరల్లో చిక్కుకున్న గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించడం ద్వారానే మా సమస్యలు పరిష్కారమవుతాయని ఆశ.

– రెడ్డి పైడితల్లి, గృహిణి

అప్పన్న సన్నిధిలో ట్రావెన్‌కోర్ సంస్థానాధీశులు



బేడా ప్రదక్షిణ చేస్తున్న ప్రిన్సెస్ అశ్వతి తిరునాళ్, గజల్ శ్రీనివాస్ తదితరులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ట్రావెన్‌కోర్ సంస్థానాధీశులు, అనంత పద్మనాభ స్వామి దేవాలయ ట్రస్టీ ప్రిన్సెస్ డాక్టర్ అశ్వతి తిరునాళ్ గౌరీ లక్ష్మీబాయి, ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వీరి పేరిట అర్చకులు అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనమిచ్చి, ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాలను, చిత్రపటాన్ని దేవస్థానం ఈవో త్రినాథరావు అందించారు.

రైతు, కార్మిక సమస్యల పరిష్కారానికి ఆందోళన



బైక్ ర్యాలీలో పాల్గొన్న సీఐటీయూ కార్యకర్తలు

పరవాడ: రైతు, కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26న అనకాపల్లిలోని నెహ్రూ చౌక్ వద్ద నిర్వహించనున్న ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఫార్మాసిటీలో ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ రైతు, కార్మిక సమస్యలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటయ్యాక రైతు, కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. కేంద్రం బాటలోనే రాష్ట్ర ప్రభుత్వం కూడ నడుస్తోందని ఆక్షేపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు అనకాపల్లిలో జరిగే ఆందోళన కార్యక్రమంలో కార్మికులు, రైతులు భారీ ఎత్తున పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

క్లుప్తంగా

వైభవంగా వెంకన్న కల్యాణం



తలంబ్రాల ఘట్టం నిర్వహణలో అర్చకులు

పెందుర్తి: వేంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని ఆదివారం వైభవంగా జరిపారు. ముందుగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారితోపాటు, దేవేరుల ఉత్సవ మూర్తులను వేదికపై కొలువుంచారు. ఆ తర్వాత భక్తుల సమక్షంలో శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ప్రసాద వితరణ చేపట్టారు.

రేపు ఆర్చరీ క్రీడాకారుల ఎంపిక

పరవాడ: ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల సీనియర్ ఆర్చరీ చాంపియన్‌షిప్ రికర్వ్ కాంపౌండ్ ఇండియన్ రౌండ్ విభాగాల్లో పాల్గొనేందుకు ఈ నెల 26(మంగళవారం)న విశాఖ జిల్లా ఆర్చర్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి విశాఖ జిల్లా ఆర్చరీ అసోసియేషన్ చైర్మన్ పి.సూర్యనారాయణరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాల ఆర్చరీ గ్రౌండ్‌లో ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి ఎంపిక పోటీలు జరపున్నట్లు పేర్కొన్నారు. ఎంపిక ప్రక్రియలో పాల్గొనాలనే ఆసక్తి ఉన్న క్రీడాకారులు తమ పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలను వెంట తీసుకురావాలని కోరారు. మెరికల్లాంటి క్రీడాకారుల్ని తయారు చేయాలనే లక్ష్యంతో ఈ ఎంపిక ప్రక్రియ చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు.

ఘనంగా మేరీ మాత ఆలయ వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న గండి బాబ్జీ

పెందుర్తి: మండలంలోని చింతగట్లలో మేరీ మాత ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పరిసర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. మధ్యాహ్నం అయ్యారక కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గనిసెట్టి కనకరాజు ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. దాదాపు 4 వేల మందికి భోజనాలు అందించారు. రాష్ట్ర నూనె గింజల ఉత్పత్తిదారుల సహకార సంస్థ పర్సన్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, సర్పంచ్ గనిసెట్టి వెంకటలక్ష్మి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఆగితే వెలగవు..వెలిగితే ఆగవు



పగటిపూట వెలుగుతున్న వీధి దీపం, హైమాస్ట్ లైట్

పరవాడ: వాడచీపురుపల్లి, నాయుడుపాలెం గ్రామ పంచాయతీల్లో సిబ్బంది నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. పంచాయతీల పరిధిలోని వీధిలైట్లు పగలు రాత్రి తేడా లేకుండా వెలుగుతూనే ఉన్నాయి. సిబ్బంది నిర్లక్ష్యం వలన విద్యుత్ వృథా అవుతోంది. అడపాదడపా రాత్రి పూట వీధి లైట్లను వెలిగిస్తున్న పంచాయతీ సిబ్బంది పగటి పూట వాటిని ఆర్పకుండా వదిలేయడమే ఇందుకు కారణం. కొన్నిసార్లు రాత్రుళ్లు లైట్లు వేయనే వేయరు. ఎవరో ఒకరు ఫోన్ చేయడమో.. లేదంటే స్థానికంగా దానిపై అవగాహన ఉన్నవారో లైట్లు వేయాల్సిందే. పొరపాటున సిబ్బంది వేశారంటే.. ఇలా వెలుగుతూనే ఉండాలి. విద్యుత్ వృథాతోపాటు, గ్రామ పంచాయతీలపై ఆర్థిక భారం పడుతోందని స్థానికులు చెప్తున్నారు. వీధి లైట్ల నిర్వహణ పట్ల పంచాయతీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోకపోవడమే దీనికి కారణమని ఆరోపిస్తున్నారు.

రెల్ల రాల్చు పురుగుపై రైతులు అప్రమత్తం

మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ



నారపాడులో వరి పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి సత్యనారాయణ తదితరులు



వరిలో ఉధృతంగా కనిపిస్తున్న రెల్ల రాల్చు పురుగులు

సబ్బవరం: వరి పంటలో రెల్ల రాల్చు పురుగు ఉధృతి, భారీ వర్ష సూచనల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ రైతులను సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ సిబ్బందితో కలిసి వరి పంటలను ఆదివారం క్షేత్ర పరిశీలన చేసి, వరిలో ఆశిస్తున్న తెగుళ్లను గుర్తించారు. రెల్ల రాల్చు పురుగు ఉధృతి నివారణకు రైతులకు పలు సూచనలు చేశారు. మండలంలో సుమారు 3,200 ఎకరాలలో ఖరీఫ్ వరి సాగు చేస్తున్నట్లు తెలిపారు. పంట కాలంలో ఆశించిన మేర వర్షాలు కురవడంతో ఈ సీజన్లో వరి పంట దిగుబడి సంతృప్తిగా వస్తుందన్న దశలో రెల్ల రాల్చు పురుగుపై అప్రమత్తంగా ఉండాలన్నారు. దీని నివారణకు క్లోరాంత్రినిపోల్(కోరాజిన్) 60 ఎంఎల్ ఎకరాకు పిచికారీ చేసుకోవాలన్నారు. ఇదే విషయంపై గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా రైతులందరినీ అప్రమత్తం చేయనున్నట్లు పేర్కొన్నారు. వరి పంట 10 శాతం కోతలు పూర్తయ్యాయన్నారు. కోతలు ముమ్మరమయ్యే దశలో ఈ నెల 27 నుంచి 29 వరకు వాతావరణ శాఖ భారీవర్షాల హెచ్చరికల నేపథ్యంలో రైతులు వరి పంట కోతలను వాయిదా వేసుకోవాలని సూచించారు.

ఆధ్యాత్మిక భావనతో మానసిక ప్రశాంతత



అనుగ్రహభాషణం చేస్తున్న నిష్కించిన భక్త దాస



ఆటల పోటీల్లో చిన్నారుల సందడి

సింహాచలం: భక్తిమార్గంతో మానవ జీవితం సార్థకమవుతుందని హరేకృష్ణ మూమెంట్ విశాఖ అధ్యక్షుడు డాక్టర్ నిష్కించిన భక్తదాస తెలిపారు. హరేకృష్ణ మూమెంట్ విశాఖ ఆధ్వర్యంలో ఆదివారం సింహాచలం దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురం గోశాలలో కార్తీక వనభోజన కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతా భక్తి మార్గంలో నడవడం ద్వారా మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావన అలవర్చుకోవాలని సూచించారు. మానసిక ప్రశాంతతకు భగవంతుడిని స్మరించడం ఒక్కటే మార్గమని తెలిపారు. ఈ సందర్భంగా హరినామ సంకీర్తనలతో పలువురు భక్తులు అలరించారు. నాట్య ప్రదర్శనలు చేశారు. పిల్లలకు, పెద్దలకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. సామూహిక వన భోజనాలు చేశారు. కార్యక్రమంలో యదురాజ దాస పాల్గొన్నారు.

అవినీతి ఒప్పందాలను రద్దు చేయాలి'



ధర్నాలో పాల్గొన్న సీపీఎం స్థానిక నాయకులు

సబ్బవరం: వేల కోట్ల రూపాయలు ముడుపులు చెల్లించి విద్యుత్ ఒప్పందాలు చేసుకున్న అదానీని తక్షణమే అరెస్టు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రం సబ్బవరంలో పార్టీ మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి ఆధ్వర్యంలో ఆదివారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ అవినీతి ఒప్పందాలను రద్దు చేసి ప్రభుత్వ సంపదను కాపాడాలన్నారు. ఇలాంటి విద్యుత్ ఒప్పందాలతో రాష్ట్ర ప్రజలపై అధిక భారం పడుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం స్థానిక నాయకులు బర్ల రమణ, ఎం.గౌరేష్‌తో పాటు ముఠా కార్మికులు పాల్గొన్నారు.

సందడిగా బ్రాహ్మణ కార్తీక వన సమారాధన

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనరసింహ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బ్రాహ్మణ కార్తీక వన సమారాధన ఆదివారం ఘనంగా జరిగింది. శ్రీకృష్ణాపురంలోని సెంట్రల్ జైల్‌కి సమీపంలో ఉన్న కాశీ రాధగారి తోటలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన వన సమారాధనలో నగర వ్యాప్తంగా ఉన్న పలు బ్రాహ్మణ కుటుంబాలు పాల్గొన్నాయి. సామూహిక వన భోజనాలు చేశారు. ఈ సందర్భంగా మహిళలకు, చిన్నారులకు పలు పోటీలు నిర్వహించారు. సంఘం గౌరవాధ్యక్షుడు ఎం.లక్ష్మీనరసింహం తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

త్రిపురాంతకస్వామికి వట్టివేర్లతో పూజ



వట్టివేర్లతో త్రిపురాంతకస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతకస్వామికి వట్టివేర్లతో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు రమణమూర్తి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధన జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామిని దర్శించుకున్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

పెందుర్తి: నియోజకవర్గంలోని పెందుర్తి మండలం చింతగట్ల పంచాయతీలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. సర్పంచ్ గణిసేటి కనకరాజు, ఎంపీటీసీ అప్పలరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి గండి బాబ్జీ హాజరయ్యారు. వందల సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చనని ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తరశత నామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.



నిత్యకల్యాణంలో తలంబ్రాల ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా నిత్యకల్యాణం

సింహగిరీశునికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను కొలువుంచి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని వేడుకగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

ఘనంగా పసలమ్మతల్లి పండగ



వేషధారణలో పెదనాయుడుపాలెం అయ్యప్ప భక్తులు

సబ్బవరం: మండలంలోని పెదనాయుడుపాలెంలో పసలమ్మతల్లి పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో పాడి పంటలు వృద్ధి చెందాలని రైతులు ఏటా ఈ పండగను నిర్వహించడం ఆనవాయితీ. కార్తీకమాసంలో నిర్వహించే ఈ పండగను పురస్కరించుకుని సుమారు 300 మంది అయ్యప్ప మాలధారణ భక్తులతో పాటు వందల సంఖ్యలో మహిళలు భారీ ఊరేగింపుగా వెళ్లి, అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించారు. అమ్మవారి సన్నిధికి పశువులను తీసుకెళ్లి, పశు సంపద దినదినాభివృద్ధి చెందాలని వసంతకం జల్లి పూజలు నిర్వహించారు. పెదనాయుడుపాలెం అయ్యప్ప పీఠం భక్తులు వివిధ వేషధారణలో ప్రత్యేక సేవ నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప మాలధారణ భక్తులు గొర్లి శ్రీనివాస్, ఎస్.నాగేంద్ర, ఎస్.సత్యనారాయణ, కె.ఎం. నాయుడు, ఎస్.సురేష్, బోకం రామకృష్ణ, ఎస్.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తీరంలో సండే సందడి



తిక్కవానిపాలెం తీరంలో జలకాలాడుతున్న సందర్శకులు

పరవాడ: కార్తీకమాసం పుణ్యదినాలను పురస్కరించుకుని తీర ప్రాంతాలు ఆదివారం సందర్శకులతో కళకళలాడాయి. తీర ప్రాంతాల్లో పిక్నిక్‌ల కోసం సందర్శకులు ఆదివారం ఉదయం నుంచే తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాలకు చేరుకున్నారు. మధ్యాహ్నం వరకు ఇసుక తిన్నెలపై ఆట పాటలతో సందడిగా గడిపారు. వెంట తెచ్చుకున్న ఆహారాన్ని తిక్కవానిపాలెం జెట్టీ దిగువన, జీడి తోటల్లోను భుజించారు. సాయం సంధ్య వరకు తీరంలో జలకాలాటలతో కేరింతలు కొట్టారు. అనంతరం ఆనందంగా తిరుగుముఖం పట్టారు.